ఎ.యస్.శ్రీ. రమణారావు



# కర్తవ్యం

రెండు మూడు రోజుల్లో వినాల్సొస్తుందని ఊహిస్తున్న వార్తే అయినా, ఆ ఉదయం నిద్ర లేస్తూనే పిడుగు లాంటి ఆ వార్త వినేసరికి ఒక్క క్షణం నిలువునా చలించి పోయాను.

"మరో సంవత్సరం కన్నా ఎక్కువ కాలం నేను బతకనట్రా".

అదేదో ప్రమోషను వార్తలా, నవ్వుతూ సంవత్సరం క్రితం చెప్పిన సుబ్బారావు మళ్ళీ ఇప్పుడు ఎదురుగా నుంచొని—

'చూశావా నేను చెప్పిం దక్షరాలా ఎలా జరిగిందో' అని అదే నవ్వుతో అంటున్నట్టనిపించి, కళ్ళు చెమ్మగిల్లాయి.

ఎప్పుడొస్తుందో తెలీక, ఎప్పుడో అప్పుడు వచ్చి తీరుతుందని తెలిసినంత మాత్రం చేత అప్పుడెప్పుడో ముంచు కొచ్చే ఆ చావుని తలుచుకుంటేనే ఒళ్ళు జలదరిస్తుందే.

అలాంటిది—

బతుకు రుచి అప్పుడప్పుడే తెలుసుకుంటున్న పాతికేళ్ళ వయసులో, మరో ఏడాదికి మించి బతకన్న అతి దుర్భరమైన సంగతి ఖచ్చితంగా తెలిసీ ఎవడు నిటుకు నవ్వుతూ బతకగలడూ?

ఎంత గుండె ధైర్యం ఉండాలి దానికీ? అదే సుబ్బారావులో ఉన్న ప్రత్యేకమైన విశేషం.

ఎలాంటి విపరీతమైన పరిస్థితి కానీండి, వాడి మొహం మీద ఆ చిరునవ్వు రవ్వంతయినా వాడిపోదు.

అంత ఆత్మీయమైన ఆ నవ్వు ఎవరి మొహాల్లోనో కానీ,ఎక్కడో కానీ తారసపడదు మనకు. ప్రపంచంలో చాలా అరుదుగా ఎదురయ్యే అలాంటి వ్యక్తుల్లో సుబ్బారావొకడు. వాడితో పది నిమిషాలు మాట్లాడితే చాలు—జన్మంతా గుర్తుండి పోతాడు. ఆ పది నిమిషాల్లో, మన గుండెల కంటుకు పోయిన వాడి చిరునవ్వు ఎప్పటికీ చెరిగి పోకుండా ఉండిపోతుంది.

పిడుగు పడుతోందన్నా సరే—అది పడే ముందు ఎంత నిబ్బరంగా ఉంటాడో, పడిన తరవాత కూడా అంత నిబ్బరంగానూ ఉండగలడు వాడు.

ఎస్సెల్సీ పబ్లిక్ పరీక్షల్లో, లెక్కల పేపరో కుంటాను. మొదటి గంట బెల్లు కొట్టేసిన తరవాత వచ్చి గుమ్మం ముందు నుంచున్నాడు గుండాలో. పరీక్ష పేపరు ఇవ్వడానికి, గడువు దాటిపోడానికి అరగంటయి పోయింది. వాడొచ్చిన అలికిడికి హాల్లో పరీక్ష రాస్తున్న కుర్రాళ్ళందరి కళ్ళూ వాడి వేపు తిరిగాయి.

"గంట తరవా తొచ్చి నుంచుంటే ఏంచెయ్యను? పరీక్ష పోయిన తర్వాత పెళ్ళి కుదిర్చుకునే గుండుకి ఇప్పుడే ఏవంత తొందర వొచ్చిందిరా?" అన్నాడు వాచరు నవ్వుతూ.

ఆ మాటలకి హాలంతా నవ్వులతో గొల్లుమందొక్కసారి.

"తొందర నాకు కాదు సార్, మా నాన్న కొచ్చేసింది" అన్నాడు వాడూ నవ్వుతూ.

"ఏం? మీ నాన్న కేమొచ్చిందిరోయ్?" అడిగాడు వాచరు నవ్వుతూనే.

"చావు సార్!"

అతి నిబ్బరంగా వాడన్న మాట విని, మొత్తం అక్కడున్న వాతావరణ మంతా స్తంభించి పోయింది. అంతవరకూ నవ్వుతున్న మొహాల్లో వెతికితే నెత్తురు చుక్క లేదు.

వాచరు మారు మాట్లాడకుండా పరీక్ష పేపరిచ్చేశాడు.

ఆ పరిస్థితి నుంచి తేరుకుని, పేపరు రాయడం మొదలెట్టడానికి మాకో పది నిముషాల కన్నా పట్టింది కానీ, వాడు పేపరందుకోడంతోనే చకచకా రాయడంలో మునిగి పోయాడు.

మచ్చుకి చెప్పానిది.

ఇలాంటి దారుణమైన సన్నివేశాలు వాడి పాతికేళ్ళ జీవితంలో కోకొల్లలు. ఎలాంటి దారుణమైన సంఘటనలయినా వాడి ముందు తలొంచుకునే వెళ్ళిపోయాయి కానీ వాటి ముందూ వాడుమాత్రం తలొంచుకుని కుంచించుకు పోలేదు ఒక్క దాని ముందు తప్ప.

సంవత్సరం తర్వాత చనిపోతా డన్న వార్త వాడికి తెలిసిన మూడు నెలలకి జరిగిన ఆ దుస్సంఘటన ఆ ఒక్కటే!

"అదే—

వాడి పెళ్ళి!

మేమిద్దరం పుట్టిందీ, పెరిగిందీ, చదువుకుందీ, ఒకే వూరు కావటంతో మా ప్రగాఢమైన స్నేహం ఎన్నడు కోదాకినా, అభిప్రాయ భేదా కినావిరావేలేదు. రహస్యా లసల్లేవు. చిన్నప్పట్నుంచీ మేం అనుకున్నట్టుగానే, మా వూళ్ళోనే, ఒకే ఆఫీసులోనే మా ఇద్దరికీ ఉద్యోగాలు కావటంతో, మా ఇద్దరి మధ్యా ఉన్న అనుబంధం మరింత ప్రాణం పోసుకుంది! ఒకళ్ళొకళ్ళు ఒక్క రోజు చూడకపోతే ప్రాణంపోయినట్టుండేది! ఒకళ్ళకు తెలీకుండా మరొకళ్ళు ఆఫీసుకు సెలవన్నా పెట్టేవాళ్ళం కాదు.

రెండే రెండు సందర్భాల్లో మాత్రం నాకు తెలీకుండా వాడే సెలవు పెట్టాడు.

మొదటి సందర్భంలో వాడు సెలవునుం చొచ్చిం తర్వాత తెలిసిన వార్త — వాడి చావు!

రెండో సందర్భంలో తెలిసిన వార్త—

వాణిజ్య ప్రకటనలకు
ఆంధ్రప్రభ
ఉత్తమ సాధనం

సూపర్ బాల్ పెన్....
హాయిగా, మెత్తగా రాసేది.

కేమ్లిన్
121 జాటర్
లక్షలాది ప్రజల అభిరుచులకు అనువుగా ఉండేలా రకరకాల రంగులలో దొరుకుతుంది. ఈ ధరలో దొరికే బాల్ పెన్‌లలో దీనిని మించినది మరేది ఉంటుంది!




వాడి పెళ్ళి!

ఉద్యోగాల్లో చేరటంలో మా ఇద్దరికీ ఒకే ఒక్క రోజు తేడా ఉండటం చేత, చేరిన రెండేళ్ళకి, వాడి కంటే ముందు నాకు ప్రమోషన్ వొచ్చిందని తెలిసిన రోజు మధ్యాహ్నం లంచ్ బ్రేక్‌కి వెళ్ళి వచ్చిం తర్వాత.

"... ఏదో ఒకటి, ఎప్పుడొచ్చినా, ఇద్దరికీ విడిచి పెట్టకుండా రావట మనే ఆనవాయితీ మట్టుకి తప్పలేదురోయ్. చూసేవా! నీకు ప్రమోషన్ వొస్తే, నాకు గుండెల్లో నొప్పొస్తోంది" అన్నాడు నవ్వుతూనే.

నవ్వుతూ చెప్పినా, ఆ నొప్పి తాలూకు బాధ, వాడి మొహంలో కనిపెట్టి, "సుబ్బూ! డాక్టర్ దగ్గర కెళ్ళరా చెప్తున" అన్నాను కంగారుగా.

"నీ మొహం" అని నవ్వేసి పనిలో మునిగి పోయాడు.

మర్నాడు వాడు ఆఫీసులో కనపడక పోవటంచేత కాళ్ళూ, చేతులూ ఆడక ఆ మధ్యాహ్నం సెలవు పెట్టేసి వా ఢింటికి పరుగెత్తాను.

"రాత్రి గుండెనొప్పి విపరీతం కావటంతో డాక్టర్ని తీసుకొస్తే, 'మైల్డ్ ఎటాక్' అని చెప్పి విశాఖపట్నం తీసుకెళ్ళమని చెప్తే, మేనమామా, తల్లీ కలిసి ఈ తెల్లార్జామున టాక్సీలో తీసుకెళ్ళారు" అని ఆ ఇంట్లో అద్దె కుంటున్న ఆయన చెప్పేడు నన్ను చూడగానే.

ఆ వెళ్ళటం మరి మూ్రడోజుల్దాకా కనపల్లేదు వాడు.

నాలుగోరోజు ఉదయమే ఆఫీసు కెళ్ళటానికి తయారై వచ్చినట్టు, మామూలుగా నవ్వుతూ వచ్చిన వాణ్ణి చూసి, "ఎలా ఉందిరా సుబ్బూ" అని, కళ్ళనీళ్ళ పర్యంతమై, నే నడుగుతో వుంటే—

"మరో సంవత్సరం కన్నా ఎక్కువ కాలం నేను బ్రతకనురా" సర్వ సాధారణంగా నవ్వుతూ చెప్పిన సమాధానం విని, నిలువునా ఒణికిపోయాన్నేను.

రెండో సందర్భం మరీ విచిత్రంగా జరిగింది!

వాడి కయిదేళ్ళప్పుడు కాబోలు వాడి మేన మామకి కూతురు పుట్టినప్పుడు, రెండు కుటుంబాల వాళ్ళూ ముక్త కంఠంతో 'వాడికి పెళ్ళాం పుట్టిం' దన్నారు. అంత చిన్నప్పుడు వాడి లేత మనసులో వాళ్ళు పాతిన చిన్న విత్తనం మొక్కయి వేళ్ళు పాదు కుని పెరిగి మహావృక్షమయి పోయింది ఈ పాతికేళ్ళ లోనూ. ఆ అమ్మాయీ అంతే. వీడు ఆ అమ్మాయిని చూడ్డం కోసమే నెల కోసారి మేనమామగా రూరు పరుగెత్తటమూ, ఆ అమ్మాయి వీడిని చూడ్డం కోసమే తరచూ ఈ వూరొచ్చినప్పుడల్లా, ఇద్దరూ కలిసి సినిమాలకీ, షికార్లకీ తిరగటం నాకు తెలీకుండా జరిగేవి కావు. పల్లెటూరి అమాయకత్వంతో చదువు కోడం వల్ల అబ్బిన సంస్కృతితో, తరుచూ పట్నం వస్తూ ఉండటం మూలాన అలవడ్డ కొద్ది నాగ రికతతో, ముగ్ధ మనోహరంగా ఉండే ఆ అమ్మాయి వీడి పక్క నిలుచున్నప్పుడు చూడ ముచ్చటగా ఉండేది చెప్పొద్దూ, 'అలాంటి మేనమామ కూతురు నాకు లేకపోయిందే'ని విచారంగానూ ఉండేది! మా ఇద్దరి మధ్యా ఉన్న స్నేహం గురించి ఆ అమ్మాయికి బాగా తెలుసు.

ఆ సర్పే శ్రావణ మాసంలో, వాళ్ళ పెళ్ళికి ముహూర్తం నిర్ణయించేశారు. ఆ నిర్ణయం చేసిన తరవాత తెలిసింది సంవత్సరం తరవాత వాడు చచ్చిపోతాడని.

ఆ సంగతి తెలిసిన మరు క్షణం నుంచి మేన మామ మొహం చాటేశాడు.

సుబ్బారావయితే ఆ విషయాన్ని చాలా తేలిగ్గా తీసుకోగలిగాడు గానీ, వాళ్ళమ్మగారు మాత్రం భరించలేకపోయారు.

స్వయాన మేనమామే అలా ప్రవర్తిస్తే, ఏ ఆడ పిల్ల తండ్రీ మాత్రం ముందు కొస్తాడని ఆమె బెంగ. ఆ బెంగకు తోడు, చెట్టంత కొడుకు సంవ త్సరం తరవాత అంతర్థానమై పోతాడన్న భయం. వీటన్నిటితోనూ ఆమె మంచాన పడింది.

అర్థాంతరంగా తను చనిపోతే, తన ఆయుష్షు పోసుకునైనా కొడుకు బ్రతుకుతాడేమోనన్న ఆమె పిచ్చి నమ్మకం!

ఆ మొండి నమ్మకంతోనే వైద్యం చేయించుకో డానికి ఆమె ససేమిరా వప్పుకోలేదు! సుబ్బారావుకి వాడి చావు, ఒక సమస్యగా తోచలేదు గానీ, తల్లి మొండితనానికి వాడికి భయం పట్టుకుంది. నన్ను చెప్పమన్నాడు. చెప్పి చూశాను. లాభంలేక పోయింది. సంవత్సరం తరవాత, చెట్టంత కొడుకు చావు కళ్ళ జూసి బ్రతికుండడం కన్నా, వాడి చేతిలో పిడికెడు బుగ్గయి పోవడమే మేలని ఆమె ఆరాటపడి పోడం చూస్తే గుండె పిండయిపోయేది.

తల్లి మంచాన పడిపోయిందనీ, చూసే దిక్కూ చేసే దిక్కూ లేదనీ ఒకసారొచ్చి చూసెళ్ళమని మేనమామ కెన్ని కబుర్లెళ్ళినా, తోబుట్టువన్న మమకారమన్నా లేకుండా ప్రవర్తించాడు మేనమామ. వూ ళ్ళోకొచ్చినా గుమ్మంలో కొచ్చి తొంగి చూడ లేదు.

తల్లి బాధ చూడలేక, వీడే కాళ్ళీడ్చుకుంటూ వెళితే, గుమ్మంలోంచే వీలు చూసుకొనొస్తా ననీ' చెప్పి పంపిం చేశాడు.

నెల తిరక్కుండా తోబుట్టువు చనిపోయిం దని కబురెళ్ళినా, వచ్చి చూడ్డానికన్నా వీలవలే దతనికి.

తనకంటూ మిగిలిన ఆ ఒక్క తల్లినీ, ఆమె కోరు కున్నట్టు, పిడికెడు బుగ్గి చేసొచ్చి, "ఒరే! నేను చచ్చిపోతే నా శవం మీద పడి ఏడవడానికి ఉన్న ఒక్క అమ్మా పోయిందిరా. ఇక నా శవం మోసేవాళ్ళెవ్వరా?" నిర్వికారంగా వాడంటున్నప్పుడు—

"సుబ్బూ!" అని వాణ్ణి పట్టుకుని భోరున ఏడుస్తున్న నన్ను చూసి—

"అనివార్యమైన నీ దుఃఖాన్నయినా నన్ను కొద్దిగా మిగుల్చుకోనీరా" అన్నాడు నవ్వుతూ.

ఆ సంఘటనప్పటించీ వాడి జీవిత విధానమే మారి పోయింది.

అసలే నిర్లక్ష్యంగా తిరిగేవాడు. అయిన్దానికీ కాని దానికీ, డబ్బు మంచి నీళ్ళల్లా ఖర్చు పెట్ట సాగేడు. జీవితాన్ని నియమానికి లోబడి ఉంచేశాడు. అయితే నా దగ్గిర మాత్రం ఏదీ దాచేవాడు కాదు.

"ఇవాళ నేను మామయ్య దగ్గర కెళ్తున్నాన్రా"

అన్నాడో రోజు.

"ఎందుకురా?" అన్నా నర్థం గాక.

"చెప్తా—వెళ్ళొచ్చాక" అని వెళ్ళాడు.

వచ్చి మాత్రం చెప్పలేదు!

వాడి మొహాన్ని బట్టి చూస్తే వాడనుకున్న పని జరగలేదని మాత్రం ఖచ్చితంగా తెలుస్తోంది. నేను రెట్టించి అడగనూలేదు. అక్కణ్ణుంచి మాత్రం మౌనంగా, పరధ్యాన్నంగా, ఎప్పుడూ ఏదో ఆలోచిస్తున్నట్టూ ఉండేవాడు. వాడిని చూస్తుంటే, కొసకొచ్చి కరిగిపోతున్న కొవ్వొత్తిలా అనిపించి గుండెలు తొలిచేసేవి. వాడిని సాధ్యమయినంత వరకూ ఒంటరిగా ఉండనిచ్చే వాణ్ణి కాదు.

ఒక రోజు నయనే తలంటి నీళ్ళు పోసుకుని కొత్త బట్టలు కట్టుకుని, నుదుట తిలకం దిద్దుకుని చేతిలో బరువయిన స్వీట్స్ పేకెట్ పట్టుకుని ప్రత్యక్షమయిన వాడినలా చూసి ఆశ్చర్యపోయాను.

"ఏమిట్రా మురళా! ఏమిటి విశేషం?" అనడిగాను వాడిచ్చిన స్వీటందుకుంటూ.

"ఇవాళ నా పెళ్ళి" అన్నాడు నవ్వుతూ.

అర్థం కాక అయోమయంగా చూస్తున్న నన్ను చూసి—

"నా పెళ్ళికి ముహూర్తం నిర్ణయించిన రోజురా ఇవ్వాళ. అయినా, అసలు పెళ్ళయినా మా అమ్మ బతికుంటే ఈ వేషంలో నన్ను చూసి ఆనందించుకునేది. మా మావయ్య కూతురు ఊహించుకుంటూ ఉంటుంది. అందుకని కట్టా నీ వేషం. ఎలా ఉన్నానేం?" అన్నాడు నవ్వుతూ.

నిజంగా పెళ్ళికొడుకు లాగే ఉన్నాడు.

అంత అందంగా, ఆరోగ్యంగా, పుష్టిగా ఉన్న వాడి నా క్షణంలో చూసిన ఎవడికయినా మరో తొమ్మిది నెల్ల తరవాత వాడు చనిపోతాడంటే,చస్తే నమ్మకం కుదరదు. వాడి వెలా కళ్ళప్పగించి చూస్తూ ఉండిపోయిన నా భుజం మీద చెయ్యేసి "డోంట్ బి సో సెన్సిటివ్" అన్నాడు నవ్వుతూ.

వాడి బలవంతం మీద, ఆ మధ్యాహ్నం సెలవు పెట్టేసి, మంచి హోటల్లో భోంచేసి, మేట్నీ సినిమా కెళ్ళి తిరిగొచ్చి వాడింట్లోనే ఏడు గంటల్దాకా గడిపి తిరిగొచ్చేశాను.

ఆ మర్నాడు వాడాఫీసులో కనపళ్లేదు.

సెలవు చీటీ కూడా రాలేదు!

నా గుండెలు దడదడలాడేయి!

ఎ. జీ ఇన్‌స్పెక్షనుండటంతో ఆఫీసు నుంచి కదలడానికి వీల్లేకపోయింది.

పని చేస్తున్నానే కానీ మనసంతా కుంచించుకున్నట్టయింది ఆరోజంతా.

ఆ సాయంకాలం తిరా పరుగెత్తుకుని వాడింటి కెళితే తలుపు తాళం వేసుంది.

"నిన్న రాత్రి నుంచి కనపళ్లేదు బాబూ!" —అద్దెకుంటున్నాయన్ని భోగట్టా చేస్తే వచ్చిన సమాధానం.

రెండ్రోజుల తరవాత మళ్ళా రావొచ్చాడు.

ఒక్కడూ రాలేదు.

తనతో మేనమామ కూతుర్ని తీసుకొచ్చాడు.

పట్టినే తీసుకు రాలేదు.

పెళ్ళి చేసుకుని మరీ తీసుకొచ్చాడు.

"…. ఆరోజు నువ్వలా వెళ్ళావా, ఇలా పరుగెత్తుకొచ్చింది కమల…" అంటూ మొదలెట్టి —

"ఆ అమ్మాయి రావటం రావటం పెళ్ళిబట్టలతో ఉన్నది ఉన్నట్లుగా పరుగెత్తు కొచ్చిందనీ, వచ్చి రావటమే తన కాళ్ళ మీద పడి, ఎంత బ్రతిమాలినా మొరాయించినా తనని కనీసం సంప్రదించకుండా నిర్ణయం చేసిన ఎవడికో కట్టబెట్టడానికి నిశ్చయించారనీ, ఆ పరిస్థితిలో ఏం చెయ్యాలో తోచక, అందరి కళ్ళు కప్పి పరుగెత్తు కొచ్చాననీ, చావయినా బ్రతుకయినా తన తోటిదే జీవితమనీ, తనుకాదంటే చావు తప్ప మరో గతి లేదంటూ ఏడ్చిందనీ, ఎన్నివిధాల చెప్పినా తన నిర్ణయానికి తిరుగులేదని ఖచ్చితంగా చెప్పిందనీ, పైగా వెతుక్కుంటూ గడియకో క్షణంకో తండ్రి రావచ్చని వచ్చి నానా రభస చేస్తాడనీ, ఎంతవేగం ఈ వూరు విడిచి వెళితే అంత మంచిదని తొందర చేసిందనీ అప్పటి కప్పుడు సంభవించిన ఆ పరిస్థితిలో మరేం ఆలోచించడానికి తనకేం తోచలేదనీ, వెంటనే టాక్సీ వేయించుకుని, అన్నవరం వెళ్ళి, ఆరోజు తనకు నిర్ణయించిన ముహూర్తానికే, గుళ్ళో ఆమె మెడలో మూడు ముళ్ళూ వేయాల్సిచ్చిందనీ."

—జరిగిందంతా చెప్పుకొచ్చాడు.

"తరవాతయినా మీ మావయ్యక్కబురెట్టలేక పోయావా? కూతు రేమయిందోనని కంగారుపడు తుంటాడు కదా" అన్నాను.

"కబురెట్టడమే ఖర్మ! ఏమయితే అదవుతుందనీ కమలని తీసుకుని ఆ మర్నా డుదయమే మామయ్య దగ్గర కెళ్ళాను" అన్నాడు.

"ఏమన్నాడూ?" అడిగాను.

"ఒకటో రెండో అంటే గుర్తుంచుకుని చెబుదును. అనవలసిన వన్నీ అన్నాడు. చెయ్యవలసిన గొడవంతా చేశాడు. తన మాట కాదని ఇల్లు విడిచిన క్షణమే తన కూతురు చచ్చిపోయిందనుకున్నాననీ, ఇక మీదట తనతో ఎటువంటి సంబంధం పెట్టుకున్నా సహించేది లేదని చెప్పేశాడు. గుమ్మంలో కాలన్నా పెట్టకుండా తిరిగొచ్చేశాం" అన్నాడు నవ్వుతూ.

అలా జరిగింది వాడి పెళ్ళి!

షోళంగిపురం

# యోగ నరసింహస్వామి

షోళంగిపురం అని ఈ నాడు పిలిచే పుణ్య స్థలాన్ని పూర్వం 'కడిగై' అని, 'షోళ సింహపురం' అని పిలిచేవారు. షోళంగిపురం మద్రాసుకు 40 మైళ్ళ దూరంలో ఉంది.


'కడిగై' అంటే 'ఘడియ' అని అర్థం. ఈ పుణ్య స్థలంలో ఒక్క గడియసేపు ఉంటే ముక్తి సిద్ధిస్తుందని ఒక నమ్మకం. షోళంగిపురంలో 320 అడుగుల ఎత్తున ఒక కొండ ఉంది. ఆ కొండ మీదనే యోగ నృసింహ స్వామి వారి ఆలయం ఉంది. అందువల్ల ఈ ప్రదేశానికి 'కడిగాచలం' అనే పేరు కూడా ఉంది. నృసింహస్వామి ఉండటం చేత ఈ కొండను 'సింహపురం' అని,కొండమీదంతా పూర్వపు చోళదేశం పోలికలు ఉండటం వల్ల 'చోళ సింహపురం' అని కూడా పిలుస్తున్నారు.

ఈ కొండపైన నృసింహస్వామి అముదవల్లి (లక్ష్మీదేవి) తో పూజ లందుకుంటున్నాడు. 'కడిగై' అనే మాటకు 'తోట' అనే అర్థం కూడా ఉంది. 'కడిగాచలం' అంటే 'చెట్లతో నిండిన కొండ' అని చెప్పబడుతూంది. దీనిపైన నృసింహస్వామి తూర్పు దిశను చూస్తూ,నాలుగుచేతులలో యోగాసనంలో 'హేమకూట' విమానంలో ఉన్నాడు. స్వామి సప్త ఋషులకు ఇక్కడ ప్రత్యక్షమైనాడు అని ఒక నమ్మకం. నృసింహస్వామి ఇక్కడ దెయ్యం పట్టిన వాళ్ళకు, ఆరోగ్యం బాగా లేని వాళ్ళకు,మనస్సు బాగాలేని వాళ్ళకు గుణం కలగచేస్తాడని ప్రసిద్ధి. స్వామి సన్నిధికి దగ్గరలోనే అముదవల్లి అమ్మ వారికి వేరే గుడి ఉంది.

నృసింహస్వామి ఉన్న కొండ కెదురుగా ఇంకొక కొండ 200 అడుగుల ఎత్తులో ఉంది. ఈ కొండనే 'చిన్నమలై' ( చిన్నకొండ ) అని పిలుస్తారు. ఇక్కడ ఆంజనేయస్వామి నాలుగు చేతులతో శంఖ, చక్రధారిగా యోగాసనంలో నృసింహస్వామినిచూస్తూ కనిపిస్తాడు. ఆంజనేయస్వామి శంఖ, చక్రధారియై ఇలా యోగాసనంలో ఉండటం ఇక్కడ ఒక విచిత్రం. దానికి కారణం—ఇంద్రద్యుమ్నుడు అనే రాజు రాక్షసులతో యుద్ధం చేయాల్సి వచ్చినప్పుడు నృసింహస్వామి సహాయం కోరగా, స్వామి భక్తుని కాపాడ తలచి రామావతారంలో తన భక్తుడైన ఆంజనేయ స్వామికి తన శంఖం, చక్రం ఇచ్చి రాక్షసులను హతమార్చమని ఆజ్ఞ ఇచ్చాడట. స్వామివారి ఆజ్ఞ ప్రకారం ఆంజనేయస్వామి రాక్షసులను ఓడించిన తర్వాత శంఖ చక్రాలను శుభ్రంచేసి స్వామికి తిరిగి ఇచ్చాడు. అప్పుడు స్వామి ఆ రోజు నుంచి ఆంజనేయ స్వామికి కూడా తనలాగే శంఖ చక్రాలతో చతుర్భుజుడుగా తన కెదురుగా ఉండి, తన భక్తులను కాపాడమని చెప్పాడట. ఆ నాటి నుంచి ఆంజనేయుడు స్వామి చెప్పినట్లుగానే ( మన కష్టాలను తీర్చేందుకు ) వెలసి ఉన్నాడు. ఆంజనేయస్వామి శంఖ, చక్రాలను శుభ్రపరచిన కొలను 'చక్రతీర్థం'గా పిలవబడుతూంది. చక్రతీర్థం కొండమీదనే ఉంది.

షోళంగిపురంలోనే ఆదికేశవ స్వామి వారి ఆలయం కూడా ఉంది. ఈ గుడి నృసింహస్వామి వారి గుడికి రెండు మైళ్ళ దూరంలో ఉంది. షోళంగిపురంలో సుమారు నూట ఎనిమిది తీర్థాలు ఉన్నాయని అంటారు. వాటిలో 'తక్కాన్ కుళమ్' అని పిలవబడేది ప్రథమ తీర్థం. ఈ తీర్థం కొండ కిందనే ఉంది. ఈ కొలను పక్కనే వరదరాజస్వామివారి ఆలయం కూడా ఉంది.

- బి. వి. ఎస్. లక్ష్మి




అదిగో! ఆ సంఘటన నుంచి మొదలయింది వాడికి చావంటే భయం! ఒక్కోరోజు గడుస్తున్న కొద్దీ, మొలకెత్తిన ఆ విత్తనం వేళ్ళు చాచుకుని పెనుభూతంలా వాణ్ణి చుట్టుముట్టేసింది. ఆ అమ్మాయి మాత్రం మొండి ధైర్యంతో ఉండి వాడి నెన్ని విధాల ఆలోచన నుంచి మళ్ళిద్దామని ప్రయత్నిస్తున్న కొద్దీ ఆ భయానికి వాడు మరింత బానిసయిపోయాడు!

వాడి భయానికి తగ్గట్టు, పెళ్ళయిన సరిగ్గా ఆరునెల్లకి రెండోసారి గుండెపోటు వచ్చి, నానా హడావుడీ చేసింది. అప్పుడే చెప్పారుడాక్టర్లు మూడోసారికి నిలబడ్డం కష్టమని.

ఆ మాటకి ఆ అమ్మాయి నిలువెల్లా కంపించి పోడం కళ్ళారా చూసి చలించి పోయాను. అదిగో ఆ క్షణంలోనే సుబ్బారావు తన చావుని ఖరారు చేసుకున్నాడు. మిగిలిన ఆ మూడు నెలల్లో నా గడుస్తున్న ప్రతి రోజూ ఒక గండంలా తోచేది. ఏ క్షణం ముంచుకొస్తుందో నని గుండెలు చిక్కబట్టు ని ఎదురు చూడ్డమే అయేది. చివరి నెల రోజులూ నా డాఫీసుకు రావటం మానేశాడు. ఆఫీసు వదిలిన మరు క్షణం నుంచీ నాకు వాడి తోటిదే ప్రపంచమూ, జీవితమూ అయి పోయింది.

సరిగ్గా పది రోజుల క్రితమనుకుంటాను— ఒక రోజు ఆఫీ సొదలగానే వాడింటి కెళ్ళేసరికి,

"పదరా, ఇవాళ కాస్సేపు బయటకలా వెళ్ళొద్దాం" అన్నాడు.

ఆ అమ్మా యేమంటుందో నేమో నని వాడి వెనక చూశాను.ఆ జాడలేదు.''కమల రాదు. రావద్దన్నాను. నీ తోటే మాట్లాడాలి పద'' అన్నాడు.

"చలి గాలిలో బయట కెందుకురా? ఇక్కడే కూర్చుందాం" అన్నాను.

"నిండా మునిగిన వాడికి చలేమిటిరా" అన్నాడు వాడి ధోరణిలో వాడు నవ్వుతూ.

వాడి ననుసరించక తప్పింది కాదు నాకు. పూరు బయటకు, మేమ్ ఎప్పుడూ షికారు కని వెళ్ళే చోటుకు వచ్చే వరకూ ఒక్క మాట మాటాడ లేదు వాడు. మేమ్ అలవాటుగా కూర్చునే తూము మీద కూర్చుంటూ, "మన ఇన్నేళ్ళ స్నేహంలో నీకు చెప్పకుండా దాచి ఉంచిన విషయం ఒకటుందని నీకు గుర్తుందా?" అడిగాడు గంభీరంగా.

అలా వాడి మొహం నే నెప్పుడూ చూడలేదు,

"అవును. ఆ మధ్య మీ మావయ్యగారింటి కెళుతూంటే, 'ఎందుకురా' అని నే నడిగితే 'వచ్చి చెబుతా'న'న్నావు. వచ్చి చెప్పలేదు నువ్వు. 'నువ్వే ఎప్పుడో అప్పుడు చెబుతావులే'ని నేనూ అడగలేదు" అన్నాను ఆ విషయం ఇప్పుడెందు కెత్తాడో అర్థంగాక.

"నే ననుకున్నది జరగ లేదప్పుడు. జరిగింటే ఈ సంపత్సం వచ్చుండేది కాదు' అన్నాడు.

"ప్రతి చిన్న విషయాన్నీ నువ్వు సీరియస్‌గా పట్టించుకోవడం, ఇప్పటి నీ స్థితికి మంచిది కాదునే సుబ్బా!" అన్నాను వాడంత కంఠకూ గంభీరంగా మారిపోవడం గమనించి.

"అది చిన్న విషయం కాదురా. ఒక జీవిత సమస్య" అన్నాడు.

బొత్తిగా అర్థం కాలేదు నాకు. ఆ రకంగా మొహం పెట్టిన నన్ను చూసికో

"చెబుతా విను. చిన్నప్పటినుంచి నన్ను మేనల్లుడుగా కాకుండా అల్లుడిగా చూసుకుంటూ వచ్చిన మావయ్య నాకు గుండె పోటొచ్చిన మరుక్షణం నుంచీ కనీసం మేనల్లుడి నన్న సంగతికూడా మరిచి పోయాడు. దానికి నే నేం బాధ పడలేదు" ఆగాడు కాస్సేపు.

"ఇప్పుడదంతా ఎందుకురా" అన్నాను వాడెక్కడ ఎక్సైట్ అవుతాడో నని.

"ఈ క్షణంలో నన్ను ఆడ్డకు. నా గుండెల్లో దాచుకున్నదంతా చెప్పనీ. ఈ క్షణం మన మధ్య మళ్ళీ రాకపోవచ్చు."

వాడి మాటకు అడ్డొస్తున్న నన్ను మాటా డ్డకుండా చేతో ఆపి, "నా బాధంతా నా మీద ఆశలు పెంచుకుంటూ వచ్చిన కమల గురించే. నా ఆలోచనలనుంచి కమలని తప్పించడానికి మావయ్య దాని పెళ్ళి చేయడానికి తొందర పడుతున్నాడని తెలిసింది. ఆ తొందరలో ముందూ వెనకా ఆలోచించ కుండా ఏ అయోగ్యుణ్ణో దాని మెడకు తగిలించేస్తాడో నని భయపడి పరుగెత్తు కెళ్ళాను. వెళ్ళి కమలని నీ కిచ్చి పెళ్ళి చేయమని కాళ్ళా వేళ్ళా పడి బతి మాలాను" అని ఆగాడు.

నేను షాకయి నోట మాట రాకుండా వాణ్ణే చూస్తూ ఉండిపోయాను. " 'నా కూతురి బాగోగులు నాకు తెలుసు. నీ సలహా ఎవడూ అడగ లేదు. నీ మొహం దానికి చూపించకుండా ఉంటే చాలదే పది వేల' న్నాడు. కమలని చూసే అవకాశ మన్నా ఇవ్వకుండా వీధి లోంచే పంపించేశాడు. ఆ సంఘటనతో తొందరపడి దారంట పోయే వాడ్ని నెవణ్ణో చూసి దాని మెడలకు కట్టెయ్య బోతే పరుగెత్తు కొచ్చేసింది నా దగ్గిరికి."

నేను వినటం తప్ప ఏం మాట్లాడలేదు.

"ఆ రాత్రి నా దగ్గిర కొచ్చిన కమలకు కూడా ఎంతో చెప్పాను. వినలేదు. నేను కాదంటే చావటం తప్ప మరో గత్యంతరం లేదంది. అప్పటి కప్పుడు మీ వాళ్ళ దగ్గిరి కొచ్చి వాళ్ళకి నచ్చచెప్పి, ఆ రాత్రికి రాత్రి మీ పెళ్ళిజరిపించడమూ ఒక సమస్యే కదా. తెల్లార్తే వెతుక్కుంటూ మా మావయొచ్చి దాన్ని లాక్కెళ్ళి పోతాడేమో? అలా బలవంతంగా లాక్కెళ్ళిపోతే అదేం అఘాయిత్యం చేస్తుందో? నన్ను ప్రశ్నలూ, దానితొందరా, నన్నునిలకడగా ఆలోచించ నీయలేదు. ఆ విచిత్ర పరిస్థితుల్లో నన్ను పెళ్ళి చేసుకున్న దాని బ్రతుకు ఇంకొద్ది రోజుల్లో బండ అయి పోవడానికి సిద్ధంగా ఉంది" అంటూ చేతుల్లో మొహం దాచుకుని వెక్కివెక్కి ఏడ్చేడు.

సుబ్బారావు ఏడవటం నేంటూ చూడటం అదే మొదటిసారి, ఆఖరుసారీను.

"ఛ, ఛ! ఇప్పుడేం జరిగిందిరా సుబ్బా. నీకేం అవదు. నువ్వు నూరేళ్ళు బ్రతటానికే భగవంతుడు మీ పెళ్ళి జరిపించాడు" అన్నాను వాడి భుజ మీ్మద చెయ్యేసి ఓదార్పుగా.

ఫక్కున నవ్వేడు వాడు. నవ్వి "ఆ పిచ్చి నమ్మకం నా కెప్పుడూ లేదు. ఇప్పుడు నన్ను పట్టి వేధిస్తున్న దల్లా ఒకే ఒక్క సమస్య. నాతర్వాత కమల గతేమిటి? అన్నీ, అందర్నీ నాకోసం వదులుకు వొచ్చిన దాని జీవితం నేను పోయిం తర్వాత ఒంటరిగా ఎలా సాగుతుంది?" మళ్ళీ ఎక్సైట్ అయిపోతున్న వాణ్ణే అడ్డే,

"నువ్వన్నీ వూహిస్తున్నావురా సుబ్బా. నువ్వు భయపడుతున్నట్టేమీ జరగదు" అన్నాను.

"ఇన్ని రాత్రి నా సమస్యకో పరిష్కారం దొరికే వరకూ నా భయం తీరలేదు. దానికి నువ్వంగీకరిస్తే, నేను విశ్రాంతిగా కళ్ళు మూస్తాను" అన్నాడు నా కళ్ళల్లోకి దీనంగా చూస్తూ.

"చెప్పరా సుబ్బా! చెప్పు. నా చేతనైనంత సాయం తప్పకుండా చేస్తాను" అన్నాను ఆవేశంగా.

"అది చెప్పేముందు నీకు మరో విషయం

చెప్పాలి" అన్నాడు.

"చెప్పు."

"తప్పనిసరి పరిస్థితుల్లో కమల మెళ్ళో తాళి కట్టాను తప్ప, ఈ మూడు నెలలూ ఒక స్నేహితుడిగానే తప్ప, భర్తగా మరేవిధంగానూ ప్రవర్తించలేదు."

"సుబ్బూ!" ఆశ్చర్యంగా అన్నాను.

"అవున్రా! నాకు తెలుసు. ఏమాత్రం ఆవేశపడినా, నా గుండెల్లో దాక్కున్న భూతం నన్ను బ్రతకనివ్వదని నాకు తెలుసు. నా ఆవేశం వల్ల కమలకు మరో బాధ్యత మెడకు చుట్టుకోకూడదనే, నాకు కమలతో పెళ్ళయిన మరుక్షణంనుంచీ ఉప్పూ పులుసూ నోటికి తగల్నివ్వకుండా చప్పగా బ్రతుక్కొస్తున్నాను" ఆగాడు.

ఇన్నాళ్ళబట్టీ వాడి దిన చర్యలో ఆ విషయం గమనించ నందున నాకు చెప్పలేని ఆశ్చర్యం కలిగింది.

"నువ్వు తీసుకున్న మూర్ఖమైన నిర్ణయం నాకేం నచ్చలేదురా సుబ్బూ" అన్నాను కాస్త కోపంగా.

"లేదురా. నేను సరయిన నిర్ణయం తీసుకోగలిగాను కనుకనే నిర్మలమైన కమలను నీ చేతుల్లో ఉంచాలన్న నిశ్చయానికొచ్చాను."

నోట మాటరాక నిశ్చేష్టుణ్ణయి పోయిన నన్ను చూస్తూ — "ఈ ప్రపంచంలో నా మాట నమ్మగలిగింది నువ్వొక్కడివే. కమల జీవిత సమస్యని తీర్చ గలిగిందీ నువ్వు ఒక్కడివే. కమల నా దగ్గరకు పరుగెత్తు కొచ్చిన రాత్రే చెయ్యవలసిం దీపని. కానీ అప్పుడు ముంచు కొచ్చిన పరిస్థితులు సాధ్యపడ నిచ్చేయి కాదు. అందుకే అపురూపమయిన ఆ పువ్వుని అనాఘ్రాతంగా దాచి ఉంచి నీ చేతుల్లో పెడుతున్నాను. దీనివల్ల ఈ సంఘంలో నువ్వెదుర్కోబోయే పరిస్థితులూ, మీ కుటుంబంలో చెలరేగే కల్లోలాలు నాకు తెలుసు. అవి ఎదుర్కొని నిలబడ గలిగే ధైర్యం నీ కుందనీ తెలుసు. సంస్కారం గురించి కాకపోయినా ఎదుటి మనిషి పట్ల పిడికెడు సానుభూతి కోసమైనా నువ్వీ సాహసం చెయ్యాలి. లేకపోతే నా తర్వాత కమల బ్రతుకు కుక్క చింపిన విస్తరయి పోతుంది. చిన్నప్పటినుంచీ ఒకే ప్రాణంగా మెలిగిన స్నేహితుడు పోతూ పోతూ ఈ భయంకరమైన బాధ్యతని మెడకు తగిలిస్తున్నా డనుకోవద్దు. ఒక అనాథకురాలి జీవితాన్ని కొంత రక్షణ కల్పించాలన్న మానవతా వాదంతో ఆలోచించు. ఆమె పట్ల నేను చేసిన ఘోరమైన తప్పుని నా స్నేహితుడిగా నువ్వు సరిదిద్దు. నువ్వు కాదంటే చచ్చిన తర్వాత కూడా నా ఆత్మకు శాంతి ఉండదురా."

నా చేతుల్లో మొహం దాచుకుని వెక్కివెక్కి ఏడుస్తున్న వాణ్ణి సముదాయించాలని కూడా తోచలేదు వాడి మాటలతో నిర్ఘాంత పోయిన నాకు ఆ పరిస్థితిలో.

నే నేం మాట్లాడక పోవడం చూసి, "ఇందులో ఒత్తిడి లేదు, శాసింపూ లేదు. మనసిచ్చిన ఒక మంచి స్నేహితుడిని దయ చూపమని అర్థించే అర్థింపు మాత్రమే ఉంది. ఇహ ఈ విషయమై నేను మళ్ళీ ప్రస్తావించను. నా ఆదనంతరం జరిగే ఈ చర్య మీద మాత్రం నేను చనిపోయినా, నా ఆశ చావదు. సమగ్రంగా ఆలోచించి, సానుభూతితో పరిశీలించి, దయతో నువ్వు తీసుకునే నిర్ణయం పట్ల ఒక విధి వంచితురాలి జీవితమూ, ఒక అభాగ్యుడి ఆత్మశాంతి ఆధారపడి ఉన్నాయి. ఇవే నేను చెప్పగలిగే ఆఖరు మాటలు. నేను చనిపోయే లోపల నీ నిర్ణయం తెలియ జేసినా నేను చనిపోయిన తరవాత నీ నిర్ణయం అమలు జరిపినా, రెండూ ఒకటే నాకు. పద పోదాం" అంటూ లేచాడు.

నేను మౌనంగా అనుసరించాను.

మా ఇద్దరి మధ్యా మరి మాట లేదు, ఇళ్ళు కెళ్ళిందాకా.

ఆ తరవాతకూడా ఇద్దరిలో ఏ వొకరము ఆ ప్రసక్తి లేదు.

నాలో మాత్రం ఎడతెగని ఆలోచనలు.

గత నాలుగు రోజులుగా వాడి పరిస్థితి మరీ క్షీణించి పోయింది.

రెండు మూడు రోజుల వరకూ ఫరవాలేదని నిన్న డాక్టర్లు నటంతో రాత్రి పది గంటల వరకూ ఉన్న వాణ్ణి, ఎందుకో ఇంటికి రావాలనిపించి వచ్చేశాను. వచ్చే ముందు ప్రశాంతంగా నిద్ర పోతున్న సుబ్బుని చూడటం అదే ఆఖరు సారని కల్లోకూడా అనుకోలేదు.

అలా పడుకున్న వాడు నిద్ర లోనే పోయాడని నిద్ర పోతున్న నన్ను గాభరాగా లేపి, అమ్మ అన్న మాట విని, నిశ్చేష్టుణ్ణయి పోయాను.

గతమంతా కళ్ళ ముందు తిరుగుతూ ఉంటే లేచిన వాణ్ణి లేచినట్టే కూర్చుండి పోయిన నన్ను చూసి—

"కూచుండి పోయావేంట్రా. వెళ్ళవూ? వెళ్ళరా వెళ్ళు, ఆ అమ్మాయి ఒక్కర్తీ ఏం గాభరా పడుతూందో?" అంది అమ్మ దయగా.

అప్పటి గ్గాని నా కా సంగతి తోచనందుకు సిగ్గు పడి పరుగెత్తు కెళ్ళాను. అప్పటికే ఆ చుట్టు పక్కల వాళ్ళు చేరారు.

కమల మోకాళ్ళలో మొహం దాచుకుని మౌనంగా రోదిస్తోంది.

సుబ్బు నిశ్చింతగా నిద్ర పోతున్నట్లే ఉన్నాడు.

ఒక్కసారి కట్టలు తెంచు కొచ్చిన దుఃఖాన్ని బలవంతంగా అణచుకున్నాను కాని కళ్ళల్లో ఉబికొచ్చే కన్నీటి ప్రవాహాన్ని ఆపుకో లేక పోయాను.

తక్షణం కర్తవ్యం గుర్తు కొచ్చి ఏర్పాట్లు పూర్తి చేశాను. శవాన్నెత్తు తున్నప్పుడు ఒక్కసారి బిగ్గరగా ఏడ్చిన కమల దగ్గిరి కెళ్ళి సానుభూతితో తల మీద చెయ్యి వేశాను కానీ, నాకూ మాటలు రాలేదు.

అగ్ని సంస్కారానికి ముందు 'సుబ్బు' మొహంలోకి చివరి సారిగా, నిశ్చలంగా చూశాను.

"నేను చనిపోయిన తరవాత నువ్వు తీసుకునే నిర్ణయం పట్ల ఒక విధివంచితురాలి జీవితమూ ఒక అభాగ్యుడి ఆత్మశాంతి ఆధారపడి ఉన్నాయి. వాడి నోట్లోంచి ఆ మాటలు మళ్ళీ వింటున్నట్టయి తుళ్ళి పడ్డాను.

మరుక్షణంలో వాణ్ణి మంటలు చుట్టు ముట్టాయి.

కాలిపోతున్న వాడి వేపే అలా చూస్తూండి పోయిన నాకు, "బాబూ! ఆ అమ్మాయి యున్నట్లుండి గదిలో కెళ్ళి తలుపులు బిడాయించుకుంది. ఎవరెన్ని విధాల చెప్పినా తలుపులు తీయుట లేదు. పదండి బాబూ త్వరగా". పక్కింటాయన పరుగెత్తి కొచ్చి కంగారుగా అనడంతో గాభరాగా పరుగెత్తాను.

నేను వెళ్ళేటప్పటికే ఎవరో తలుపులు బద్దలు కొట్టారు. దూలాన్ని వేళ్ళాడుతున్న చీరా, దానికి దిగువన రోదిస్తూ ఆమెని చూసేసరికి,

"ఒక్క క్షణం తలుపులు బద్దలవటం ఆలస్య మవుతే అమ్మాయికూడా దక్కేది కాదు" అంటున్నారెవరో.

నా కవేవీ వినిపించటం లేదు.

నేను రాగానే ఎవరి మటుకు వాళ్ళెళ్ళి పోయారు.

ఆ గదిలో మే మిద్దరమే మిగిలాం.

"కమలా! శరీరాలే వేరు కాని, సుబ్బుదీ నాదీ ఒకటే ప్రాణం. వాడు పోతూ నన్నెందు కొదిలేశాడంటే నీ గురించి. నా కంతా తెలుసు. ఈ క్షణం నుంచీ నువ్వు నా దానివి" అంటూ ఆమె చేతిని నా చేతిలోకి తీసుకున్నాను.

కమల నా వేపు ఆశ్చర్యంగా చూస్తూ నిలుచుండి పోయింది కొన్ని క్షణాలు. *

